## క్లుప్తంగా

### రామాలయం నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**గన్నవరంరూరల్:** మండలంలోని సూరంపల్లి గ్రామంలోని సగర్లపేటలో నిర్మిస్తున్న శ్రీ భద్రాద్రి రామాలయం నూతన నిర్మాణానికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య మంగళవారం తన తల్లిదండ్రులు తోట సీతారామయ్య, సీతారామమ్మల జ్ఞాపకార్థం లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. గ్రామంలోని సగర్ల సంఘం ఆధ్వర్యంలో రామాలయం నిర్మించేందుకు ఆ సంఘం పెద్దలు, ఆలయ కమిటీ వెంకయ్యను కలిసి సహకారం అందించాలని కోరారు. దీనికి స్పందించిన ఆయన ఆలయం వద్ద కమిటీ పెద్దలు, సంఘం సభ్యులు, యూత్ సమక్షంలో నగదు అందజేశారు. దాత వెంకయ్య దాతృత్వాన్ని ఆలయ కమిటీ కొనియాడింది. కార్యక్రమంలో సర్పంచ్ పులపాక బాబూరావు, ఎంపీటీసీ సభ్యులు కొండా సీతారామయ్య, సోమిశెట్టి శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, రాంబాబు, ప్రశాంత్ పాల్గొన్నారు.

### మైనింగ్ చెక్‌పోస్టుల ఏర్పాటు

**విజయవాడరూరల్:** విజయవాడ సబ్‌కలెక్టర్ అదితిసింగ్ ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ మండలంలోని నాలుగు గ్రామాల్లో మైనింగ్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో బీఎల్‌వీ శేషగిరిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతపాడు గ్రామంలో గుబ్బలగట్టు వద్ద, అంబాపురం గ్రామంలో పాములకాల్వ జంక్షన్‌వద్ద, జక్కంపూడి గ్రామంలో ఆంజనేయస్వామి గుడివద్ద, కొత్తూరుతాడేపల్లి గ్రామంలో పెట్రోల్‌బంక్ వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్టుల్లో రెవెన్యూ, పోలీసు అధికారుల నిఘా ఉంటుందని చెప్పారు.

### డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**ఉంగుటూరు:** కృష్ణా జిల్లా సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో వేంపాడులో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కిసాన్ క్రెడిట్ కార్డులు, పీఎం జీవన జ్యోతి యోజన, అటల్‌పెన్షన్ యోజన, పశువుల, మత్స్య సంపద బీమాపై అవగాహన కల్పించారు. స్వయం సహాయ బృందాలకు తక్కువ వడ్డీరేటుకే రుణాలు, డిపాజిట్లు, బీమా భద్రత, ఖాతాదారులకు ఏటీఎం కార్డులు, రూపే కార్డుల ఉపయోగాలను వివరించారు. పీఏసీఎస్ చైర్మన్ నాగసబోయిన సోమేశ్వరరావు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ పనుల గుర్తింపు

**ఉంగుటూరు:** మండలంలోని పలు గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి ప్రణాళిక పనుల గుర్తింపు గ్రామసభలు మంగళవారం నిర్వహించారు. ముక్కపాడు, ఇందుపల్లి, లంకపల్లి గ్రామాల్లో గ్రామసభల ద్వారా 237 పనులు గుర్తించామని ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. సర్పంచ్‌లు ఎస్.అంజనాదేవి, బి.వెంకటలక్ష్మి, కె.సుజాత, ఎంపీటీసీలు, పాలకేంద్రం అధ్యక్షులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లు, సచివాలయ గృహ సారథులు పాల్గొన్నారు.

### అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు పారిశ్రామికవేత్త పర్వతనేని పాండురంగారావు వితరణతో అన్నదానం నిర్వహించారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### వికాస్ కాలేజీలో కంటి వైద్యశిబిరం



**నున్న(విజయవాడరూరల్):** నున్న గ్రామంలోని వికాస్ కళాశాలలో జాతీయ సేవా సమితి, వాసవీ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ మానవ శరీరంలో కన్ను ముఖ్యమైందన్నారు. కళ్లను సున్నితంగా చూసుకుంటూ, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటిచూపులో లోపాలను తెలుసుకొని చికిత్స చేయించుకోవచ్చని చెప్పారు. వాసవీ కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులు మొత్తం 210 మందికి వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో జాతీయసేవా సమితి కో ఆర్డినేటర్ జి.శేఖర్‌రెడ్డి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# జగనన్నతోనే సామాజిక న్యాయం

- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- తాడిగడపలో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

**పెనమలూరు:** జగనన్న పాలనతోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప గ్రామం శ్రీనివాసానగర్, నిమ్రా కాలనీలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. నాలుగున్నర సంవత్సరాల్లో ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు బుక్‌లెట్‌లు లబ్ధిదారులకు అందజేసి, స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. జగనన్న అధికారం చేపట్టిన తరువాత అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేకూరిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో పేదలకు అన్యాయం జరిగిందని చెప్పారు. టీడీపీ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. బడాబాబులకు దోచిపెట్టారని విమర్శించారు. గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాయని తెలిపారు.

**అవినీతికి దూరంగా పాలన..**

జగనన్న పాలన అవినీతికి దూరంగా చిత్తశుద్ధితో అమలు జరుగుతుందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలతో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అర్హులకు అమలు చేస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలతో దోపిడీ జరిగిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో వాస్తవ పరిస్థితులను ప్రజలు తెలుసుకుని ఓట్లు వేయాలన్నారు. నిమ్రా కాలనీలో డ్రెయినేజీ సమస్యను స్థానికులు తెలుపగా వెంటనే డ్రెయినేజీలు నిర్మాణం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, తాడిగడప పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నాయకులు నర్రా చంటి, కాకి శ్రీనివాసరావు, ముజీబ్, శ్రీకాంత్‌రెడ్డి, ఖాదర్‌బాషా, అర్షద్, పి.కిషోర్, వెలిశిల ప్రసాద్, కృష్టోఫర్, సిద్దిక్, వేమూరి బాలకృష్ణ, తుమ్మల వరదీష్, ఈదా రాజేష్, చుండూరు శేఖర్, అంకెం రాజేష్, కె.సుబ్బరాజు, ఆకునూరు సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# రైతులకు ఆర్థిక భరోసా

- వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ రెండో విడత నగదు జమ
- మండలంలో 7,238 మంది రైతులకు రూ.1.65 కోట్ల లబ్ధి



సీఎం వైఎస్ జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న రైతులు

**ఉంగుటూరు:** అన్నదాతలకు నేనున్నానంటూ ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాన్ని సమర్థంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.. సాగు పెట్టుబడులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా చిన్న, సన్నకారు రైతులకు, కౌలు రైతులకు చేయూతనందిస్తూ ప్రోత్సహిస్తోంది. రెండో విడతగా రైతు భరోసా నగదును శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం విడుదల చేస్తున్న కార్యక్రమాన్ని లబ్ధిదారులు ఆర్బీకేలో వీక్షించారు. రైతు భరోసా ప్రకటించినప్పటి నుంచి అర్హులైన ప్రతి రైతుకూ నగదు అందిస్తూ సాగును వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పండగలా మార్చింది. ఈ వ్యవసాయ సీజన్‌లో తొలి విడతగా ఈ ఏడాది జూన్ ఒకటో తేదీన రైతు భరోసా కింద రూ.5,500, పీఎం కిసాన్ కింద రూ.2 వేలు చొప్పున మండలంలో 6,309 మంది రైతులకు, 568 మంది కౌలు రైతులకు ప్రభుత్వం రూ.4.95 కోట్లు పంపిణీ చేసింది. రెండో విడతగా రైతులు, కౌలు రైతులు మొత్తం కలిపి 7,238 మందికి రైతు భరోసా కింద రూ.2 వేలు, పీఎం కిసాన్ కింద రూ.2 వేలు చొప్పున రూ.1.65 కోట్లు జమ చేశారు.

### బాసటగా రైతుభరోసా..



పథకం ప్రారంభించినప్పటి నుంచి కౌలు రైతుగా నాకు రైతు భరోసా అందుతోంది. ఈ ఏడాది కూడా సాగు పెట్టుబడికి అవసరమైన సొమ్మును ప్రభుత్వం సమకూర్చుతుంది. కౌలు రైతులకు, రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తూ ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సాయం సాగుకు ఎంతగానో తోడ్పాటు అందిస్తోంది.

నాగసబోయిన శివశంకర్, వేంపాడు

### అర్హులందరికీ రైతుభరోసా..



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకాన్ని అమలు చేస్తోంది. సాగులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాయం అందిస్తోంది. దశల వారీగా అర్జీలను పరిశీలించి, ప్రత్యేక గ్రీవెన్స్‌లో అర్జీలను స్వీకరించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రైతు భరోసా వర్తింపజేసేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం.

వి.హరీష్‌కుమార్, ఏవో, ఉంగుటూరు

### నున్నలో అక్రమ లేఅవుట్ల తొలగింపు



**నున్న(విజయవాడరూరల్):** నున్న గ్రామంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వేసిన లేఅవుట్లను సీఆర్డీఏ అధికారులు మంగళవారం జేసీబీతో తొలగించారు. లేఅవుట్లలోని సర్వే రాళ్లను, అంతర్గత రోడ్లను తొలగించారు. నున్న గ్రామం ఆర్ఎస్ నంబర్ 37లో పార్ట్ 2.5 ఎకరాలు, ఆర్ఎస్ నంబర్లు 15/1, 2 లలో 4 ఎకరాలు, ఆర్ఎస్ నంబర్ 219/1లో 3 ఎకరాల్లో వేసిన అక్రమ లేవుట్లు వేశారు. వీటిని సీఆర్డీఏ జూనియర్ ప్లానింగ్ అధికారి ప్రభాకర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలేఖ, నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ, సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్లలోని ఇళ్ల స్థలాలను ఎవ్వరూ కొనుగోలు చేయకూడదన్నారు. అనుమతులు లేకుండా కొనుగోలు చేసి మోసపావద్దని ఆయన తెలిపారు.

### బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

**పెనమలూరు:** తాడిగడప గ్రామంలో బాలుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప రామానగర్‌కాలువ కట్టపై నాగిపోగు రాణి నివశిస్తుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. కుమారుడు బెన్ని తాడిగడప ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అతను ఈ నెల 5న ఇంట్లో తన మాట వినకపోవటంతో తల్లి మందలించింది. కాగా తల్లి పనులకు వెళ్లిన తరువాత పాఠశాలకు వెళ్లాల్సిన బెన్నీ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బాలుడి కోసం కుటుంబ సభ్యులు అనేక ప్రాంతాల్లో వెతికిన, ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

### పలువురికి జరిమానా

**పటమట(విజయవాడతూర్పు):** రోడ్లపైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి మంగళవారం జరిగే మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి బి.విజయ్ కుమార్ రెడ్డి మంగళవారం పలువురికి జరిమానా విధించారు. సత్యనారాయణపురంలోని సర్కిల్–2 కార్యాలయంలో జరిగిన కేసుల విచారణలో 14 కేసులపై విచారణ జరిపి వారికి రూ.5160 జరిమానా విధించారు. మరోసారి నిబంధనలను అతిక్రమిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ హెల్త్ ఆఫీసర్–2, డాక్టర్ వి.రామకోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్–2 కె.ఆర్. నవకిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

## ప్రాణాలను నిలబెట్టే పరిశోధనలు విస్తృతంగా జరగాలి



సదస్సులో పాల్గొన్న డాక్టర్ గౌరవ్ శుక్లా, డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగేశ్వరరావు, యాజమాన్యం

**గన్నవరంరూరల్:** అత్యవసర సమయంలో ప్రాణాలను నిలబెట్టేందుకు విస్కో ఎలాస్టిక్ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందని న్యూఢిల్లీకి చెందిన వెర్ఫెన్ ఇండియా సైంటిఫిక్ మేనేజర్ డాక్టర్ గౌరవ్ శుక్లా చెప్పారు. గన్నవరం మండలం చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాతల నుంచి రక్తాన్ని సంగ్రహించే అధునాతన విధానంపై మంగళవారం ఒక్క రోజు వర్క్‌షాప్ జరిగింది. కళాశాల పాథాలజీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రమాదాలు జరిగినప్పుడు ఎమర్జెన్సీ సర్వీస్ అందించాల్సి ఉంటుందన్నారు. ఆ క్రమంలో ప్రమాదానికి గురైన వారికి నిర్వహించే టెస్టుల్లో ఆలస్యం లేకుండా వెంటనే ఫలితాలు వచ్చేందుకు విస్కో ఎలాస్టిక్ టెస్ట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దీనిపై నిపుణులు చర్చించటం ఎంతో అభినందనీయమని చెప్పారు. డైరెక్టర్ డాక్టర్ సీవీ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, హెచ్‌వోడీ డాక్టర్ నవీన్ చంద్రరావు, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, బ్లడ్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ జాస్మిన్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## వరకట్నం వేధింపులపై కేసుల నమోదు

**పెనమలూరు:** వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు గ్రామానికి చెందిన అల్లంశెట్టి నాగలక్ష్మి 2008వ సంవత్సరంలో ఉయ్యూరుకు చెందిన సురేష్‌బాబును వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు సంతానం. కాగా భర్త దురలవాట్లకు బానిసగా మారని అదనపు కట్నం తీసుకురమ్మని భార్యను వేధించసాగాడు. దీంతో గతంలో పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో నాగలక్ష్మి ఫిర్యాదు చేయగా భర్తకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా భర్త ప్రవర్తనలో మార్పు రాలేదు. దీనికి తోడు అత్త సరస్వతి, మామ వీరరాఘవయ్య అదనపు కట్నం కావాలని వేధించటంతో బాధితురాలు పెనమలూరు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు అత్తింటి వారిపై కేసు నమోదు చేశారు.

**పెనమలూరు:** వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి నిడమానూరు రోడ్డుకు చెందిన సుంకర రాజేశ్వరి 16 ఏళ్ల క్రితం ఏలూరుకు చెందిన సుంకర రమేష్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి బాబు, పాప సంతానం. కాగా భర్త దురలవాట్లకు బానిసై అదనపు కట్నం తీసుకురమ్మని వేధించసాగాడు. అత్త సుబ్బలక్ష్మి, ఆడపడుచు కృష్ణవేణి కూడా వేధిస్తుండటంతో ఇద్దరు పిల్లలతో రాజేశ్వరి ఈ నెల 4వ తేదీన ఏలూరు నుంచి పుట్టింటికి రావటానికి సిద్ధపడగా భర్త రమేష్ కుమారుడిని అప్పగించలేదు. దీంతో బాధితురాలు కుమార్తెతో పోరంకి చేరుకుంది. అయితే అత్తింటి వారితో తనకు, తన కుమార్తెకు ప్రాణహాని ఉందని, అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

## మాదిగల విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

**గన్నవరం:** హైదరాబాద్‌లో ఈ నెల 11వ తేదీన జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మంగళవారం ఎంఎస్‌పీ అధ్యక్షుడు మంద వేణుబాబు అధ్యక్షతన విశ్వరూప మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విక్టర్‌బాబు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం మూడు దశాబ్దాలుగా జరుగుతున్న ఉద్యమం అంతిమ దశకు చేరుకుందన్నారు. పెరేడ్ గ్రౌండ్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొన్ని వర్గీకరణపై స్పష్టమైన ప్రకటన చేయనున్నారని తెలిపారు. వర్గీకరణను సాధించడం ద్వారా మాదిగలతో పాటు మాదిగ ఉపకులాలు విద్య, ఉద్యోగ అభివృద్ధితో ముందంజలో ఉంటారని చెప్పారు. ఈ మహాసభకు నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలని కోరారు. రాష్ట్ర రెల్లి సంఘం నాయకులు ధనియాల నాగరాజు, పలువురు యువజన నాయకులు పాల్గొన్నారు.

## గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం



తాడిగడపలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

**పెనమలూరు:** గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తెలిపారు. తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మాట్లాడుతూ.. తప్పు జరగకుండా ఉండాలంటే గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై పూర్తి అవగాహన ఉండడాలన్నారు. గుడ్ టచ్ అంటే షేక్ హ్యాండ్ ఇవ్వటమన్నారు. బ్యాడ్ టచ్ అంటే తాకకూడని చోట తగలటం, దేహంపై తడమటం, బుగ్గలు నిమరటం వంటివని తెలిపారు. బ్యాడ్‌టచ్‌తో ఎవరైనా ఇబ్బందులు పెడితే వెంటనే తల్లిదండ్రులకు చెప్పాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాల్లో జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

**విజయవాడరూరల్:** విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనను అందించి విద్యా ప్రమాణాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఉపాధ్యాయులకు సూచించారు. విజయవాడ రూరల్ మండలం కుందావారి కండ్రిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యా రంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తోడు, ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ పెట్టి విద్యార్థుల మధ్య పోటీతత్వాన్ని పెంచాలన్నారు. పాఠశాల అభివృద్ధికి మౌలిక వసతులు ఎంత అవసరమో విద్యా ప్రమాణాలు అభివృద్ధి కూడా అంతే అవసరమన్నారు. ముఖ్యంగా ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులలో విద్య పట్ల ఆసక్తి పెంపొందించగలిగితే ఉన్నత విద్యను అభ్యసించేందుకు మార్గం సుగమం అవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుందన్నారు. 5వ తరగతి విద్యార్థులతో ముచ్చటించి వారిలో తెలుగు భాష పరిజ్ఞానాన్ని పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణ, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులు భోజనం చేసేందుకు హాల్ నిర్మాణం అవసరమని ఉపాధ్యాయులు, స్థానికులు కలెక్టర్‌ను కోరారు. సీఎస్ఆర్ నిధులతో డైనింగ్ హాల్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రూరల్ తహసీల్దార్ కె.లక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు యరగొర్ల శ్రీరాములు, భీమిరెడ్డి సాంబిరెడ్డి, దేవిరెడ్డి మంగారెడ్డి పాల్గొన్నారు.

## బాణసంచా దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

- ఆర్డీవో రాజు
- ప్రభుత్వ మార్గదర్శకాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో రాజు

**ఉయ్యూరు:** ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బాణసంచా దుకాణాల ఏర్పాటు, విక్రయాలు జరుపుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో రాజు సూచించారు. బాణసంచా దుకాణాల ఏర్పాటుపై ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు, ఫైర్, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఆర్డీవో రాజు మాట్లాడుతూ.. దుకాణదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. భద్రతా చర్యలు పాటిస్తూ దుకాణాలు ఏర్పాటు చేసుకుని పండుగ సంతోషంగా జరుపుకోవాలన్నారు. శని, ఆదివారాలు మాత్రమే టపాసులను విక్రయించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు.

**అక్రమంగా బాణసంచా విక్రయాలు చేస్తే చర్యలు**

**పెనమలూరు:** దీపావళి పండుగ సందర్భంగా అక్రమంగా బాణసంచా నిల్వలు, విక్రయాలు చేయరాదని సీఐ టీవీవీ రామారావు చెప్పారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే విషయంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. అక్రమంగా బాణసంచా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని శాఖల నుంచి అనుమతులు తీసుకున్న తరువాతే దుకాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కాగా మండల పరిధిలో బాణసంచా నిల్వలు ఉండే అవకాశం ఉన్న ప్రాంతాల్లో సీఐ తనిఖీలు నిర్వహించారు. గతంలో బాణసంచా కేసుల్లో పట్టుబడిన వ్యక్తులకు కౌన్సిలింగ్ చేసి, బైండోవర్ చేశారు.

## ధాన్యం కొనుగోళ్లు సమర్థంగా నిర్వహించాలి



కంకిపాడులో శిక్షణ ఇస్తున్న విజయ్‌బాబు

**కంకిపాడు:** ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు సమర్థంగా నిర్వహించాలని వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ చాట్ల విజయ్‌బాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో రైతుభరోసా కేంద్రం సిబ్బంది, పీఏసీఎస్ చైర్మన్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చైర్మన్ విజయ్‌బాబు మాట్లాడుతూ గత ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లు చేపట్టామన్నారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్ సీజన్‌లో పంట చేతికి వచ్చే సమయం ఆసన్నమైందన్నారు. పంట మార్కెట్‌కు వచ్చే ముందుగానే గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటవుతాయని చెప్పారు. సిబ్బంది తేమ శాతం సమర్థంగా పరిశీలించి రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలన్నారు. రైతులకు నష్టం జరగకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ మార్గదర్శకాలు పూర్తి స్థాయిలో అమలు జరిగేలా బాధ్యతతో వ్యవహరించాలన్నారు. సివిల్ సప్లయిస్ ప్రతినిధులు తేమ శాతం పరిశీలనపై టెక్నికల్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వీఏఏలు, పీఏసీఎస్ చైర్మన్లు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ వైద్య సేవలు



సదస్సులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సువర్ణరాజు

**రామవరప్పాడు:** జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు సంపూర్ణ వైద్య సేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సచివాలయం–5లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులతో పాటు చర్మ, కంటి, దంత, గుండె సంబంధిత వ్యాధులకు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. సర్పంచ్ వరి శ్రీదేవి మాట్లాడుతూ.. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు వెళ్లి వైద్య సేవలు పొందలేని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఈ కార్యక్రమం గొప్ప వరమన్నారు. గ్రామంలోని 5 సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను దిగ్విజయంగా నిర్వహించామన్నారు. ఈ శిబిరాల్లో గ్రామస్తులు వందల సంఖ్యలో వైద్య సేవలు పొందారని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహార పదార్థాల స్టాల్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ సాంబయ్య, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి



ర్యాలీ చేస్తున్న సిద్ధార్థ విద్యార్థులు

**మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):** క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా పీబీ సిద్ధార్థ కళాశాల గుడ్ హ్యాబిట్స్, సైకిల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల పరిసర ప్రాంతాల్లోని రహదారులపై క్యాన్సర్ అవగాహన ర్యాలీజరిగింది. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు ప్రారంభించి మాట్లాడారు. దేశమంతటా ఏటా నవంబర్ 7న జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం జరుపుకుంటామన్నారు. ర్యాలీ అనంతరం కళాశాల ఆవరణలోని మైదానంలో క్యాన్సర్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థులు నిల్చున్నారు.